శక్తివంతమైన భారతాన్ని నిర్మిద్దాం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) ఆధునిక యుగంలో దేశాన్ని సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మేడ్చల్ జిల్లాలోని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ డీఆర్ఎస్ ఇంటర్నేషన్ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇస్కాన్ గీత పఠనం వేసవి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని భవిష్యత్ తరాలకు అందిస్తూ భారత సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. ప్రపంచంలోని అన్ని సమస్యలకు భగవద్గీత ఒక్కటే సమాధానమన్నారు. నేటి బాలలే భావి భారత పౌరులని, వారిని ఆధ్యాత్మికం వైపు తీసుకురావాల్సిన బాధ్యతను ప్రతిఒక్కరూ తీసుకోవాలన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు మానవత్వం, నైతిక విలువల గురించి నేర్పించాలని సూచించారు. ఆధ్యాత్మిక చింతన పెంపొందించటానికి ఇస్కాన్ సంస్థవారు గీతా పఠనం కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. ఇస్కాన్ కమ్యూనికేషన్ చైర్మన్ యుదీష్టర్ గోవింద్ ప్రభు మాట్లాడుతూ మన శ్శాంతి కోరుకునే ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికం వైపు మళ్లాలన్నారు. ప్రతి ఒక్కరినీ ఆధ్యాత్మికం వైపు తీసుకురావడానికి తమ సంస్థ ప్రత్యేక కార్యకలాపాలు చేపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆలరించారు. పలువురు విద్యార్థులు భవగద్గీతలోని పలు శ్లోకాలను పఠనం చేశారు. కార్యక్రమంలో డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి అంజనికుమార్ ఆగర్వాల్, ఇస్కాన్ కూకట్‌పల్లి విభాగం అధ్యక్షుడు మహా శ్రింగదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇకపై వారికి పింఛన్..

స్పౌజ్ కేసులకు వర్తింపు

పింఛన్ పొందుతూ మృతి చెందిన భర్త స్థానంలో భార్యకు

బోగస్‌ల ఏరివేత ..

తగ్గనున్న భారం



7

ఉపాధి.. గగనమేనా?



వ్యవసాయ కూలీలు, రైతులకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని రోజుల్లో ఈసారి భారీగా కోత విధించారు. గత ఏడాదిలో కూలీలు పూర్తి చేసుకున్న పని రోజులతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో సగానికి సగం తగ్గించారు. అయితే ఈ ఏడాది పని రోజుల్లో భారీగా కోత విధించడంతో ఉపాధి హామీ కూలీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

సగానికి పైగా తగ్గింపు

గతేడాది 66.27 లక్షల పనిరోజుల కేటాయింపు

ఈసారి 33.61 లక్షలకు తగ్గింపు

పని రోజులు పెంచాలని కేంద్రానికి ప్రతిపాదిస్తే.. అదనంగా కేటాయించే అవకాశం

పని రోజుల్లో భారీ కోత

వికారాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వ్యవసాయ కూలీలు, రైతులకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని రోజుల్లో ఈసారి భారీగా కోత విధించారు. గత ఆర్థిక సంవత్సరంలో వికారాబాద్ జిల్లాకు 66.27 లక్షల పని రోజులు కేటాయించగా, ఈసారి 33.61 లక్షల పని రోజులు మాత్రమే కేటాయించడం గమనార్హం. గత ఏడాది జిల్లాకు 66,27,236 పని రోజులు కేటాయించగా జిల్లాలో కూలీలకు 67,09,923 పని రోజులు కల్పించారు. 1,09,954 కుటుంబాలకు చెందిన 1,93,387 మంది కూలీలకు గత ఏడాది పనులు కల్పించగా, వారిలో 10,911 కుటుంబాల సభ్యులు వంద రోజుల పనులు పూర్తి చేసుకున్నారు. జిల్లాకు నిర్దేశించిన

మిగతా 8వ పేజీలో...

ఈసారి చేపట్టనున్న పనులు

ఈ ఏడాది జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద ఫాంపాండ్ (నీటికుంటలు), ఫీల్డ్ ఛానెల్, పంట పొలాలకు రహదారుల నిర్మాణం పనులు చేపట్టనున్నారు. పశువులు, మేకల పాకలు, కోళ్ల ఫారాలు నిర్మించనున్నారు. చెక్ డ్యాంలు, ఇంకుడు గుంతలు, బోరు బావుల రీచార్జి, నాడెప్ కంపోస్టు పిట్ వంటి నీటి సంరక్షణ పనులు చేపట్టనున్నారు. గ్రామ పంచాయతీల్లో నర్సరీల పెంపకం, మొక్కలు నాటడం, మొక్కల సంరక్షణ పనులు, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం వంటి పనులు చేపడతారు.

సమాచారం

పెద్దేముల్ మండలంలో నేడు స్పీకర్ పర్యటన

పెద్దేముల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ మండలంలో నేడు(సోమవారం) అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పర్యటించనున్నట్లు తాండూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. మండలంలోని కందనెల్లి గ్రామంలో ఉదయం 10.30 గంటలకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డితో కలిసి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం 4గంటలకు మంబాపూర్ గ్రామంలో డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కిరాణాషాపులో అంగన్‌వాడీ గుడ్లు

దారి మళ్లుతున్న పౌష్టికాహారం



చౌడాపూర్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందాల్సిన అంగన్‌వాడీ గుడ్లు కిరాణా షాపులో దర్శనమిచ్చిన ఘటన చౌడాపూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని పంపిణీ చేస్తున్న కోడిగుడ్లు లబ్ధిదారులకు సక్రమంగా అందడం లేదనే విమర్శలు తరచూ వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ గుడ్లు దారిమళ్లొద్దని ప్రభుత్వం ఆ గుడ్లపై ముద్ర వేసి సరఫరా చేస్తుంది. అయితే మండల కేంద్రంలోని ఓ కిరాణా దుకాణంలో గుడ్లు కొనుగోలు చేసేందుకు వెళ్లిన స్థానికులకు అంగన్‌వాడీ గుడ్లు ఇవ్వడంతో అంతా విస్మయానికి గురయ్యారు. ఈ విషయంపై చౌడాపూర్ కారోబార్ నరేశ్ కిరాణషాప్ యజమానిని ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వలేదు. అయితే కొద్ది రోజులుగా తమకు గుడ్లు అందడం లేదని పలువురు లబ్ధిదారులు ఆరోపించారు.

నాలుగు క్వింటాళ్ల గంజాయి పట్టివేత

పనస పండ్లలోడ్‌లో తరలింపు

రూ.కోటిన్నరకు పైగా విలువైన గంజాయి స్వాధీనం

ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



పట్టుబడిన మినీ ట్రక్

మేడ్చల్, ఏప్రిల్ 27 (మేడ్చల్‌టౌన్): పనస పండ్ల లోడ్‌లో గంజాయి తరలిస్తుండగా మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. 400కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మినీట్రక్‌లో భారీగా గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో ఆదివారం మేడ్చల్‌లోని ఆక్సిజన్ పార్కు వద్ద ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మినీట్రక్‌లో పనస పండ్ల లోడులో గంజాయిని మహారాష్ట్రకు చెందిన వ్యక్తులు వైజాగ్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు గుర్తించారు. 400కిలోల గంజాయితోపాటు మినీట్రక్‌ను స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు కోటిన్నర ఉంటుందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలపడానికి మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు నిరాకరించారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గొట్టిగకలాన్ ప్రజలు

తాగునీటి ఇబ్బందులు తీర్చాలి

బషీరాబాద్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిగకలాన్ గ్రామస్తులు వారం రోజులుగా తాగునీటి కోసం తండ్లాడుతున్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద స్థానికులతో కలిసి ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. గ్రామంలో కొందరు కుళాయిలకు మోటార్లు బిగించడంతో తాగునీటి సమస్య ఎక్కువైందని వాపోయారు. గ్రామంలో వీధిలైట్లు, మురుగుకాల్వలు శుభ్రం చేయడం లేదని ఆరోపించారు. అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేదంటే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. గ్రామస్తులు రాములు, నర్సింహులు, వెంకటేశ్, అశోక్, శ్రీనివాస్, తిప్పన్న, మల్కప్ప, ఆశమ్మ దస్తమ్మ, సాయమ్మ, మొగులమ్మ, బిచ్చమ్మ పాల్గొన్నారు.



బోసిపోయిన కోట్‌పల్లి

మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్ట్ పర్యాటకులు లేక ఆదివారం బోసిపోయి కనిపించింది. ప్రతి వారం పర్యాటకులతో రద్దీగా కనిపించే ఈ ప్రాజెక్టు నెల రోజుల నుంచి సందడి కనిపించడం లేదు. విద్యార్థులకు రకాల పరీక్షలు ఉండడంతో పర్యాటకుల రాక తగ్గిందని అధికారులు భావిస్తున్నారు. ప్రాజెక్ట్‌లో మత్స్యకారులు చేపలవేట కొనసాగిస్తున్నారు. ఈ కారణంగా పర్యాటకుల రాక తగ్గి ప్రాజెక్ట్ పరిసరాలు బోసిపోయాయి.

- ధారూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి)

చక్రస్నానంతో ముగిసిన నారసింహుడి బ్రహ్మోత్సవాలు


స్వామివారి పెరుమాళ్‌కి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు


ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న లక్ష్మీ నారాయణ

కీసర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చీర్యాల్ శ్రీ లక్ష్మీనారసింహ స్వామి ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు చక్ర స్నానంతో ముగిశాయి. యాదగిరిగుట్ట ప్రధాన అర్చకుడు నృసింహ ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉత్సవాలు నాలుగురోజులు వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు పంచామృతాలతో శత ఘటాభిషేకం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం పెర్‌మాళ్‌కు చక్రస్నానం చేయించారు. ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే నక్క ప్రభాకర్ గౌడ్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ వారిని సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

- ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం
- రసాయన కూరగాయల నుంచి విముక్తి
- మండే ఎండల్లో భవనానికి చల్లదనం
- మిద్దెతోటల సాగుపై పెరుగుతున్న ఆసక్తి



ఆరోగ్యానికి మిద్దె తోట

ఘట్‌కేసర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గతంలో ఇంటి చుట్టూ విశాలమైన స్థలం ఉండేది. అందులో అనేక రకాల కూరగాయలు, ఆకు కూరలను సాగుచేసుకునేవారు. రానురాను పట్టణీకరణ పెరిగిపోయి గజం రూ.వేలు, లక్షల్లోకి చేరుకుంది. ఇల్లు నిర్మించుకోవడానికే స్థలం గగనమైన ఈరోజుల్లోనూ మేడపై తాజా కూరగాయాలు, ఆకు కూరలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన చందుపట్ల జీవన్‌రెడ్డి, తదితరులు. ఇంటిపైన వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతోపాటు పండ్ల చెట్లను సైతం సాగు చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు.

రకరకాల కూరగాయలు, ఆకుకూరలు

జీవన్‌రెడ్డి తన మిద్దెతోటలో పాలకూర, సుక్కకూర, గోంగూర(ఎరుపు, తెలుపు) కేరళ గోంగూర, మెంతి, కొత్తిమీర, పూదీన, తోటకూర, వివిధ రకాల బచ్చలికూర, కూరగాయల్లో టమాట,

మిగతా 8వ పేజీలో...

ఇంటిపైనే పండించుకోవచ్చు



మా ఇంటిపైన ఫైబర్ టబ్బులతో ఏర్పాటు చేసిన మిద్దెతోటతో ఇంట్లో ఉన్న ఆరుగురికి సరిపడా కూరగాయలు, ఆకుకూరలు అందుతున్నాయి. ప్రధానంగా రసాయన మందుల ప్రభావంలేని తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు లభిస్తాయి. మిద్దె తోటల పెంపకంపై పిల్లలకు అవగాహన కల్పించాలి.

- చందుపట్ల వినోద, ఘట్‌కేసర్

'జన జాతర'ను జయప్రదం చేయాలి

కొడంగల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని, అణచివేత, ఆధిపత్యంపై ఐక్యపోరాటలకు సిద్ధం కావాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, అంబేడ్కర్ సంఘాల అధ్యక్షుడు రమేశ్ బాబు పిలుపునిచ్చారు. ఈ నెల 30న ఉదయం 10 గంటలకు తాండూర్‌లో నిర్వహించే పూలే, అంబేడ్కర్ జన జాతర సభ సందర్భంగా ఆదివారం కొడంగల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు కనకప్ప, చిన్నయ్య, అంజిలప్ప, ఆశన్న, బాలప్ప, అంజిలప్ప, అనంతప్ప, కాశప్ప, అరుణ్‌కుమార్, అంజిలయ్య, బీరప్ప, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.



జీపీల్లో నిధులు నిల్!



- తొమ్మిది నెలలుగా అందని కేంద్ర ప్రభుత్వ ఫండ్స్
- భారంగా జీపీల నిర్వహణ
- అస్తవ్యస్తంగా పంచాయతీలు

ఆదిభట్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామ పంచాయతీలకు నిధుల గ్రహణం పట్టింది. నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రతీనెల పంచాయతీలకు రావాల్సిన రాష్ట్ర, కేంద్ర నిధులు రాక అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీనెల మంజూరు చేసే నిధులతో పనులు, ప్రజలకు వసతుల కల్పన, జీతాలకు ఖర్చు చేస్తారు. కానీ, 9 నెలలుగా నిధులు రాక పంచాయతీలు అస్తవ్యస్తంగా మారాయి. మండలంలో మొత్తం 14 పంచాయితీలు ఉన్నాయి. సర్పంచుల పదవీకాలం ముగిసిన ఏడాదిన్నర కింద ప్రత్యేకాధికారులను నియమించారు. ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహించక కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్రం ఎస్ఎఫ్‌సీ నిధులు రాలేదు. నిత్యం చేపట్టాల్సిన పనులు ముందుకుసాగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీల నిర్వహణ కార్యదర్శులకు కూడా భారంగా మారింది.

అందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు

కేంద్ర ప్రభుత్వం అందించే 15వ ఆర్థిక సంఘం నిధులు సంవత్సరం నుంచి, ఎస్ఎఫ్‌సీ ద్వారా రెండేళ్ల నుంచి నిధులు విడుదల చేయలేదు. జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు నిధులు మంజూరవుతాయి. 14 పంచాయతీలకు ఎస్ఎఫ్‌సీ ప్రకారం రూ.13.28 కోట్ల నిధులు మంజూరు కావాల్సి ఉంది. వీటితో జీపీ కార్మికుల జీతాలు తప్ప.. మిగతా వాటికి నిధులను వినియోగించవచ్చు. కానీ, ఏడాదిగా నిధులు మంజూరు కాలేదు. కేంద్ర నిధులు రాకపోవడానికి కారణం.. స్థానిక ఎన్నికలు నిర్వహించకప్రజాప్రతినిధులు లేకపోవడమే. రాష్ట్రం నుంచి ప్రతీనెల రావాల్సిన ఎస్ఎఫ్‌సీ నిధులు సైతం నిలిచిపోయాయి.

ట్రెజరీల్లో మూలుగుతున్న చెక్కులు!

గ్రామ పంచాయతీల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో చెక్కులు అందించారు. కానీ, ఇచ్చిన చెక్కులు పాస్ కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్లు సైతం పనులు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. నిధులు మంజూరు చేయాలని మాజీ సర్పంచ్‌లు కోరుతున్నారు. దాంతోపాటు ఇబ్రహీంపట్నం మండలం పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు చేసిన కార్యదర్శులు.. ట్రెజరీలలో జమ చేశారు. వాటి నుంచి కార్మికులు, కార్యదర్శులకు అందించే జీతాలకు డబ్బు డ్రా చేద్దామంటే చెక్కులు పాస్ కావడం లేదు. పంచాయతీల్లో వసూలు చేసిన పన్నులను ట్రెజరీల్లో జమచేయగా పంచాయతీలు జారీ చేసే చెక్కులు పాస్‌కాక కార్యదర్శులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో నిర్వహించాల్సిన పల్లె ప్రకృతివనాల నిర్వహణ, తాగునీరు, డ్రైనేజీ వంటి పనులు చేయాలన్నా ఇబ్బందులు తప్పడం లేదని కార్యదర్శులు వాపోతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడం లేదు. ప్రతీనెల చెల్లించాల్సిన నిధులు రాక గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిధులు మంజూరు చేయాలి.

- సీహెచ్.జంగయ్య, సీపీఎం నాయకుడు

కార్మికులకు జీతాలు ఇవ్వలేకపోతున్నాం

పంచాయతీల్లో నిధుల్లేక కార్మికులకు చెల్లించాల్సిన జీతాలు ఇవ్వలేకపోతున్నాం. శానిటేషన్, వీధి దీపాలు, తాగునీరు, మ్యాన్‌హోల్స్, పారిశుధ్య నిర్వహణ వంటి అత్యవసర పనులకు ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం ఫండ్స్ విడుదల చేయాలి.

- శివకుమార్, కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు

అడుగంటుతున్న చెరువులు

- పూడిక తీయాలంటున్న రైతులు

బషీరాబాద్,ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): తీవ్ర ఎండలతో మండలంలోని చెరువులు అడుగంటిపోతున్నాయి. ఫలితంగా సమీప పొలాల్లోని బోర్లలో భూగర్భ జలాలు పాతాంలోకి వెళ్లి నీరు పోయడంలేదు. ఆయా గ్రామాల్లో చెరువులు ఎండిపోతుండటంతో పశువులకు నీటి సమస్య తలెత్తే ఆవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని నవాల్గ నల్ల చెరువు, ఎల్లమ్మ చెరువు, అక్కలమ్మ చెరువు, ఎక్మాయి తూర్ తలాబ్, నవాంద్గీ పెద్ద చెరువులు ఇప్పటికే 80శాతంపైగా ఎండాయి. ఈ చెరువుల్లో ఇప్పుడు పూడిక తీస్తే భవిష్యత్తులో చెరువుల్లో మరింత ఎక్కువ నిల్వ ఉండి ఎండల్లో ఇబ్బందులు రావని రైతులు అంటున్నారు.


నీరు ఎండి మట్టి తేలుతున్న నవాల్గ నల్ల చెరువు

ప్రవేశ పరీక్ష ప్రశాంతం

తాండూరు రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తాండూరు మండల పరిధి ఐనెల్లిలో గల మోడల్ స్కూల్‌లో 6, 7, 8, 9, 10వ తరగతుల్లో అడ్మిషన్ పొందేందుకు ఆదివారం ప్రవేశ పరీక్షనిర్వహించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్ తెలిపారు. ఆరో తరగతి పరీక్షకు 85 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారుజ 7, 8, 9, 10వ తరగతులకు 90 మంది అప్లై చేసుకోగా 66మంది హాజరైనట్లు తెలిపారు. మొత్తం 212మందికి గాను 151 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన వివరించారు.





సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి

వాజ్‌పేయి దేశానికే దిక్సూచి

పరిగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, దివంగత వాజ్‌పేయి దేశానికి దిక్సూచి లాంటి నేత అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి కొనియాడారు. అటల్ బిహారి వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం పరిగిలోని ఎస్‌వీ గార్డెన్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నాడు వాజ్‌పేయి తీసుకున్న అనేక నిర్ణయాలతో నేడు ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. విదేశీ వ్యవహారాలపై ఆయన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో దేశానికి మేలు జరుగుతోందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద్‌రావు, రవికుమార్‌గౌడ్, రాముయాదవ్, యాదయ్య, విజయ్‌కుమార్, రాంచంద్రయ్య పాల్గొన్నారు.



వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

కొడంగల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా పత్ర్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పలు రకాల పుష్పాలతో పురోహితులు పూలంగి సేవ నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు పురోహితులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పురోహితులు పాల్గొన్నారు.



భక్తులతో సంగమేశ్వరాలయం కిటకిట


ఆలయంలో దర్శనం చేసుకుంటున్న భక్తులు

యాలాల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధి సంగెంఖుర్దు సంగమేశ్వర ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమావాస్య కావడంతో మండల ప్రజలే కాకుండా తాండూరు నుంచి వందలాది భక్తులు తరలివచ్చి సంగమేశ్వరున్ని దర్శించుకున్నారు. సంగమేశ్వర ఆలయం పక్కనగల త్రివేణి సంగమం నదీ స్నానాలు ఆచరించారు. ఆదివారం అమావాస్య రోజు సంగమేశ్వర స్వామి దర్శించుకుంటే పాపాలు తొలగుతాయని భక్తుల నమ్మకం. ఆలయ సిబ్బంది దేవాలయం ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా బీరప్ప స్వామికి బోనాలు



బోనాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

మోమిన్‌పేట్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకులపల్లిలో ఆదివారం కామరతి బీరప్పస్వామి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు బీరప్పస్వామికి బోనాల నైవేద్యాలు సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో హోరెత్తించారు. ఉత్సవాల్లో మోమిన్‌పేట్ సొసైటీ చైర్మన్ బండ విష్ణువర్ధన్‌రెడ్డి నవనీత దంపతులు బీరప్పస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భారీగా గొల్ల కురుమలు సభ్యులు పాల్గొన్నారు.

నాగలితో సభకు తరలిన మల్లారెడ్డి

బోయినపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ నాయకులు భారీగా తరలారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేసేందుకు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి నాగలిని తీసుకెళ్లారు. మల్లారెడ్డి వ్యయప్రయాసల కోర్చి నాగలిని బోయినపల్లిలోని తన నివాసంలో టేకు కర్రతో తయారుచేయించారు. అయితే బీఆర్ఎస్ పార్టీలో తనకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పాటు చేసుకున్న ఆయన వరంగల్ సభలో తనదైన శైలిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బోయినపల్లిలో కార్యకర్తలతో కలిసి తానూ రైతునేనని, అందుకే ఈ నాగలి అంటూ రైతు నాగలిని భుజాన పెట్టుకుని ఆకర్షించారు.


తాను చేయించిన నాగలిని చూపుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి





వేసవి దుక్కులతో ఉపయోగాలు మెండు!

- లోతైన దున్నకాలతో పంటలకు మేలు
- నేలలోని పోషకాలు పూర్తిగా వినియోగం
- చీడపీడల నాశనం.. అధిక దిగుబడికి ఊతం



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

చేవెళ్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వేసవిలో పొలాల్లో పంట విరామసమయంలో రైతులు సాధారణంగా బీడు భూములను అలాగే వదిలేస్తారు. నిజానికి అప్పుడే సిసలైన దుక్కి పనులు చేపట్టాలి. పంట ఎదుగుదలకు, దిగుబడిలో కీలకం దుక్కులే అనడంలో సందేహం లేదు. దుక్కులు ఎంత బాగా చేస్తే పంట అంత ఏపుగా పెరుగుతుంది. నేలలోని అన్ని రకాల పోషకాలు పైరుకు అందుతాయి. తొలకరి వర్షాలు మొదలయ్యే నాటికే లోతైన దక్కులు చేసుకోవాలి. ఇలా చేస్తే నేల పూర్తిగా ఎండుతుంది. పొలంలో పంట నాశించే పురుగులు చనిపోతాయి. వాటి లార్వాలు సైతం భూమిలో కలిసి పంట సమయంలో పురుగుల ఉధృతి భారీగా తగ్గుతుంది. వేసవిలో నేల యాజమాన్యంపై చేవెళ్ల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ పలు సూచనలు చేశారు.

దుక్కులు లోతుగా చేసుకుంటే...

వేసవి దుక్కి చేసుకునేందుకు తేమ ఉన్న నేలల్లో ట్రాక్టర్లు లేదా ఎడ్ల నాగళ్లతో దుక్కి చేసుకోవాలి. 9 ఇంచ్‌లకు తగ్గకుండా లోతుగా దున్నాలి. అలా చేస్తేనే మట్టి మొత్తం కిందికి మీదికి అయి లోపలి పొరలోని సూక్ష్మధాతువులు, పోషకాలు పైకి వచ్చి మొక్కలకు అందుతాయి. అలాలాపే పం టను నాశనం చేసే కీటకాలు ఎండకు చనిపోతాయి. యాసంగి పంటలు కోతలు పూర్తయిన వారం పది రోజుల్లోపు దుక్కులు చేసుకోవాలి.

సహజ ఎరువుల కోసం...

గతంలో సమృద్ధిగా ఉండే పశుసంపద ఇప్పుడు అంతంత మాత్రంగానే ఉంది. ఎడ్లు, ఆవులు, గేదెలతో రాత్రుళ్లు పొలంలోనే మందలు పెట్టేవారు. దాంతో నేలకు సహజ ఎరువులు లభ్యమయ్యేవి. పశువుల సంఖ్య తగ్గి పశువుల ఎరువు లభ్యం కావడం లేదు. దీంతో కొందరు రైతులు గొర్లు, మేకల మందను పొలాల్లో పెడుతున్నారు. ఇలా మంద పెట్టడం పనులు పంట విరామ సమయాల్లోనే చేయాలి. దీంతో సహజ ఎరువు లభించి నేలలో సారం పెరుగుతుంది. రసాయన ఎరువుల వినియోగం తగ్గి పెట్టుబడీ తగ్గుతుంది.

కలుపు నివారణ

తుంగ, గర్క, గుంజర, వొలిపిరి వంటి మొండిజాతి కలుపు మొక్కలు బాగా పెరిగి పంట దిగుబడిలకు నష్టం కలుగజేస్తాయి. నేల సారాన్ని కలుపు మొక్కలు ఎక్కువ తీసుకుంటాయి. దీంతో పంట మొక్కల ఎదుగల లోపిస్తుంది. వేసవి దక్కులతో ఈ కలుపు మొక్కల విత్తనాలు, వేర్లు, కాయలు నశిస్తాయి. అలాగే దుక్కి సమయాల్లో బయటపడే కలుపు మొక్కల కాయలు, వేర్లు దుంపను ఏరేస్తే కలుపును అరికట్టొచ్చు.

వేళ్లూనుకుంటాయ్!

వేసవి దక్కులతో నేల వదులవుతుంది. వర్షం పడిన తరువాత గొర్రుతిప్పి విత్తనాలు వేస్తే మొక్కలు పెరిగేకొద్దీ వాటి వేర్లుబాగా విస్తరిస్తాయి. అలాగే నేల ఎక్కువ నీటిని పీల్చుకొని తేమ ఎక్కువ రోజులుంటుంది. వర్షాభావ పరిస్థితుల్లో మొక్కలు ఎండకుండా ఉంటాయి. కోతల తర్వాత నేలపై మిగిలే పంట మొదళ్లను నేలలో కలియదు న్నితే ఎరువుగా మారుతాయి. నేలలో హ్యూమస్ పెరిగి మొక్కలకు సహజ ఎరువు లభ్యమవుతుంది.

వేసవి దుక్కులతో మంచి ఫలితాలు



వేసవిలో దుక్కులను దున్నుకోవంతో వర్షకాలంలో రైతులకు మంచిఫలితాలు వస్తాయి. లోతుగా దక్కులు చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలుంటాయి. సేంద్రియ ఎరువులను ఉపయోగించాలి. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. ఆధునిక పద్ధతులతో సాగు చేసుకోవాలి. ప్రభుత్వ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి.

- శంకర్‌లాల్, ఏవో, చేవెళ్ల

పంట పొలాలకు ఎరువుల తరలింపు

ధారూరు: మండలంలో పరిధి గ్రామాల్లో రైతులు ఎరువులను కొనుగోలు చేసి పొలాలకు తరలిస్తున్నారు. పంట కోత పూర్తయిన పొలాలకు పశువుల ఎరువు తరలించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒక ట్రాక్టర్ పశువుల ఎరువు రవాణా, కూలీల చార్జీలు కలిపి రూ.4,500కు కొనుగోలు చేసి పొలాల్లో పోయించుకుంటున్నారు. ఇందులో పశువుల ఎరువుకు రూ.3వేలు కాగా రవాణా, కూలీల చార్జీ 1500 అవుతున్నాయి. మేకలు,గొర్రెల ఎరువుకు రవాణా కూలీ చార్జీ కలుపుకొని రూ.4వేలు వరకు చెల్లిస్తున్నారు. సేంద్రియ ఎరువులతో నేలకు సత్తువ చేకూరుతుందని రైతులంటున్నారు. దీంతో సహజ ఎరువు ధర పెరిగింది.



ఆన్‌లైన్ గేమింగ్‌కు దూరంగా ఉండాలి



క్రీడాకారులకు బహుమతి అందజేస్తున్న ఏసీపీ కేపీవీ.రాజు

యాచారం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): యువకులు ఆన్‌లైన్ గేమింగ్‌కు దూరంగా ఉండాలని, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. ఆదివారం మొండిగౌరెల్లిలో ఎంపీఎల్ క్రికెట్ పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఫస్ట్ ప్రైజ్ 20వేలు, సెకండ్ ప్రైజ్ రూ.15వేలు, థర్డ్ ప్రైజ్ రూ.10వేలు అందించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ చెడు అలవాట్లు చేసుకోవద్దన్నారు. ఆన్‌లైన్ గేమ్‌లన్నీ మోసమేనని, వాటితో డబ్బు సంపాదించాలని అనుకోవడమే తప్పు అన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. యువత ఉద్యోగాలు, స్వయం ఉపాధితో తల్లిదండ్రులకు, కుటుంబానికి అండగా ఉండాలన్నారు. తన తండ్రి పేరిట ఓ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి సహకారమందిస్తానని బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఈ సందర్భంగా చెప్పారు. సీఐ నందీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోజంతా వెలుగుతున్న స్ట్రీట్‌లైట్లు



మంబాపూర్‌లో పగటిపూట వెలుగుతున్న వీధిలైట్లు

పెద్దేముల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పగలు రాత్రీ తేడా లేకుండా కొన్ని గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. వాటిని ఆఫ్‌చేసే నాథుడు లేడు. దీంత విద్యుత్ దుబారాతో పాటు పంచాయతీలకు కరెంటు బిల్లూ పెరుగుతోంది. మంబాపూర్‌లో వీధి దీపాలకు ఆన్‌ఆఫ్ సిస్టం పెట్టారు. సర్పంచ్‌లు ఉన్న సమయంలో వాటిని ఎప్పటికప్పుడు పనిచేసేలా చూసేవారు. ఇపుడు ఆన్‌ఆఫ్ సిస్టం పనిచేయక కరెంటు ఉన్నంత సేపూ లైట్లు వెలుగుతున్నాయి. దీంతో కొన్ని బల్బులు ఫెయిల్ అవుతున్నాయి. గ్రామం మొత్తం ఎస్పీపీ బాక్సులు అమర్చేందుకు ఐదారువేలు అవుతుంది. ఆ మాత్రం వ్యయం చేయలేక నెలనెలా 20వేలకుపైనే చెల్లిస్తున్నారు. ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి గ్రామంలో పగటిపూట వీధిదీపాలు వెలగకుండా ఆన్‌ఆఫ్ సిస్టం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజనులు ఏకం కావాలి



సభలో మాట్లాడుతున్న జేబీ.రాజు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బహుజనుల రాజ్యాధికారం కోసం బడుగు బలహీన వర్గాలంతా ఏకం కావాలని దళితసేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జేబీ.రాజు అన్నారు. రాజ్యాంగ హక్కులను కొందరు హరించే ప్రయత్నం చేస్తున్నారని, ఇది సమాజానికి మంచిది కాదన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన పూలే, అంబేడ్కర్‌ల జన జాతర సభలో ఆయన మాట్లాడారు. పూలే, అంబేడ్కర్‌లు రగిలించిన సామాజిక విప్లవాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాలకు చదువు, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో అవకాశాలు వచ్చాయంటే అది అంబేడ్కర్ పుణ్యమేనంటూ గుర్తు చేశారు. అణగారిన వర్గాల చదువుకోసం పూలే చేసిన కృషిని సమాజం మరువదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం కోసం పోరాటాలు తప్పవన్నారు. కుల గణనకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. నేటికి కుల వివక్ష కొనసాగుతోందని, కుల దురహంకార హత్యలకు ఎదురొడ్డి పోరాడాలన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.సామెల్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ప్రకాశ్‌కారత్, ప్రజాసంఘాల నాయకులు పురుషోత్తం, ఎం.ఆనంద్, బుగ్గరాములు, సత్తన్న, అరుణ్‌కుమార్, కిష్టయ్య, సీహెచ్.జంగయ్య, శంకర్, కె.రవి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అహంకారపూరిత వ్యాఖ్యలు సరికాదు



నేదునూరులో మాట్లాడుతున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలు క్షమించరానివని, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతొక్కరూ కట్టుబడి పని చే యాలని కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నేదునూరు, బాచుపల్లిల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి చైతన్యమంతం చేశారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు పన్నిందని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించేందుకే కాంగ్రెస్ జై సంవిధాన్‌ను చేపడుతోందన్నారు. బడుగు వర్గాలకు అండగా ఉన్న రాజ్యాంగాన్ని ఖూనీ చేసేందుకు సిద్ధమైన బీజేపీ నాయకత్వానికి ప్రజలు బుద్ధిచెప్పాలని విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలు, రాజ్యాంగాన్ని పట్టుకొని నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర చేశారు.

సన్న బియ్యం విందులో కేఎల్లార్

ప్రభుత్వం రేషన్ షాపుల్లో సరఫరా చేస్తున్న సన్నబియ్యంతో పేదలకు మేలు కలుగుతోందని లక్ష్మారెడ్డి అన్నారు. మాన్నెగూడతండాలో జెమ్లాదేవి ఇంట్లో రేషన్ బియ్యంతో వండిన భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదకుఉ ఇళ్లు, రేషన్‌కార్డులు, కొత్తగా పింఛన్లు మంజూరవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్,మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండు రంగారెడ్డి, కాంగ్రెస్ మండల ఇన్చార్జి పెంటారెడ్డి, కె.రాణాప్రతాప్‌రెడ్డి, సత్యనారాయణ, సరికొండ పాండు, శ్రీధర్, వెంకటేశ్, మూల హన్మంతరెడ్డి, భూపాల్‌రెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్, కె.యుగేందర్‌గౌడ్, సురేందర్, అమరేందర్‌రెడ్డి, పుష్ప, ఇ.రాకేష్‌గౌడ్, నర్సింహ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం

ఇబ్రహీంపట్నం: బడుగు బలహీన వర్గాలు, గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వాల్లోనే రాజ్యాంగ ఫలాలు దక్కి పూర్తి స్థాయి న్యాయం జరుగుతుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను కాపాడుకునేందుకు పార్టీలకతీతంగా ప్రజలంతా ఏకం కావాలని అన్నారు. కాంగ్రెస్‌సేవాదళ్ ఆదివారం ఇబ్రహీంపట్నంలో జై సంవిధాన్ పేరుతో రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించింది. ఇబ్రహీంపట్నం చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ర్యాలీగా బయల్దేరి మార్కెట్ యార్డు ముందున్న జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ముగించారు. ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగ, రాజీకయ రంగాల్లో సమాన వాటా కల్పించాలని రాజ్యాంగంలో పొందుపర్చారని గుర్తు చేశారు. రాజ్యాంగ రక్షణకోసం గ్రామ స్థాయి నుంచే ప్రజలు చైతన్యం కావాలన్నారు. గత పదేళ్లుగా కేంద్రంలో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన కొనసాగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో తీసుకుపోతుందంటూ కొనియాడారు. రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షుడు మంకాల దాసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, నాయకులు రాచర్ల వెంకటేశ్వర్లు, ఈసీ.శేఖర్‌గౌడ్, మహిపాల్, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, శివకుమార్, ఆకుల ఆనంద్‌కుమార్, కరుణాకర్, రాఘవేందర్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మంగమ్మ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రూ.13.37లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎం ఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యం, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్. కొందుర్గు, చౌదరిగూడ, నందిగామ, చౌదరిగూడ, కొత్తూరు మండలాల వారు అనారోగ్యంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. వారిలో 30 మందికి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో రూ.13.37లక్షల సీఎంఆర్ చెక్కులను అందజేశారు. పేదలు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకయ్యే ఖర్చును కొంతమేర ప్రభుత్వం భరిస్తోందని ఎమ్మెల్యే చెప్పారు.

ఆశ్రమంలో ఉచిత కంటి వైద్యశిబిరం



మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సాయిగీ ఆశ్రమంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లద్దాలను అందజేశారు. కంటి ఆపరేషన్ అవసరమున్న రోగులను గుర్తించారు. కార్యక్రమంలో యశోద ఆస్పత్రి వైద్యులు సరికి వెంకటరావు, ఎం.భానుప్రకాశ్, సాయిగీతాశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

తాండూరులో గాయని మధుప్రియ సందడి

తాండూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తాండూరులో సింగర్ మధుప్రియ సందడి చేశారు. గంగోత్రి విద్యాలయ వార్షికోత్సవం, మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మధుప్రియ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులతో కలిసి మధుప్రియ పాటలతో హోరెత్తించారు. ప్రజలు, కార్యక్రమాన్ని తిలకించేందుకొచ్చిన తల్లిదండ్రులు మధుప్రియతో ఫొటోలు దిగారు. ఆమెను మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న, స్కూల్ యజమాన్యం సన్మానించింది. కరస్పాండెంట్ రాములు, ప్రిన్సిపాల్ గోపాల్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సరితాదేవి పాల్గొన్నారు.



మధుప్రియను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఇకపై వారికి పింఛన్

- స్పౌజ్ కేసులకు వర్తింపు



తాండూరు,ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో పింఛన్‌ల కోసం ఎదురు చూసిన దరఖాస్తుదారులు అలసిపోయారు. ఈ ప్రభుత్వం కూడా కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొంత మేర పింఛన్‌దారులపై కొంత కనికరం చూపింది. ఆర్థిక భారం పడకుండా పింఛన్‌లు మంజూరు చేసేలా చూస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో స్పౌజ్ కేసులను పరిశీలిస్తోంది. వృద్ధాప్య పింఛన్ పొందుతూ భార్యభర్తల్లో ఎవరు చనిపోయినా దంపతుల్లో బతికున్న వారికి పింఛన్ మంజూరుకు వివరాలను సేకరిస్తున్నారు. ప్రస్తుతం వృద్ధాప్య, వితంతు పింఛన్‌దారులకు నెలనెలా రూ.2,016 చెల్లిస్తోంది. గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా అర్హులను గుర్తించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వీరందరికి మే నెలలో పింఛన్లు మంజూర య్యేలా చూస్తామని సెర్ప్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. భార్య/భర్త డెత్ సర్టిఫికెట్, పింఛన్ కార్డు, ఆధార్‌కార్డుతో పాటు బ్యాంకు అకౌంట్, ఓటర్ ఐడీ కార్డులను జత చేయాలని అధికారులు సూచిస్తున్నారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా స్పౌజ్ కింద 4,798 మంది అర్హులను గుర్తించారు. ఈ నెలాఖరు కల్లా స్పౌజ్ పింఛన్లు అప్డేట్ చేసి మేలో ఇచ్చేలా డీఆర్డీఏ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మైగ్రియంట్స్, బోగస్‌ల ఏరివేత

గ్రామాలు, పట్టణాల నుంచి ఇతర ప్రాంతాలకు వలస పోయిన వారు చేయూత(ఆసరా) పింఛన్ కోల్పోతున్నారని గ్రామీణ పేదిరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) అధికారుల పరిశీలనలో తేలింది. ఇలా వలస వెళ్లిన వారి వివరాలు సేకరించారు. వరుసగా వరుసగా మూడు నెలలు డబ్బు తీసుకోకుంటే పింఛన్ రద్దు చేస్తారు. గ్రామాభివృద్ధి శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా పర్మినెంట్ మైగ్రియంట్స్(శాశ్వతంగా వలస వెళ్లినవారు)ని 10,600గా గుర్తించారు. గ్రామాల్లో పోస్టాఫీసులు, మున్సిపాలిటీల్లో బ్యాంకు అకౌంట్ల ద్వారా పింఛన్ పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో శాశ్వతంగా వలసవెళ్లిన వారి, చనిపోయిన వారి పేర్లను తొలగిస్తారు. చాలా కాలంగా పింఛన్‌కు దూరమైన వారి వివరాలను సేకరిస్తున్నట్లు డీఆర్డీఏ అధికారులు పేర్కొంటున్నారు. జీవిత భాగస్వామిని కోల్పోయి, కుటుంబ భారం మోస్తున్న వితంతువులకు పింఛన్లు మంజూరుచేయాలని కోరుతున్నారు. కొన్నేళ్లుగా వితంతు పింఛన్లు మంజూరుచేయడం లేదని గ్రామాల్లో పేదలు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 4వేల వరకు వితంతు పింఛన్లు పెండింగ్ ఉన్నట్లు తెలుస్తోంది. పింఛన్ల సంఖ్య పెంచకున్నా పర్వాలేదుకానీ పాతవారి స్థానంలో స్పౌజ్‌కు ఇవ్వాలని కోరుతున్నారు.

మార్కెట్ యార్డు నుంచి పందుల తరలింపు

ఆమనగల్లు,ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మార్కెట్ యార్డ్ నుంచి ఆదివారం పందులను తరలించారు. మార్కెట్ యార్డ్‌లో పందుల బెడద ఎక్కువైంది. ధాన్యాన్ని తెస్తున్న రైతులు పందులతో ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాదికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి చొరవ తీసుకొని పందుల పెంపకందారులకు సమాచారం ఇచ్చారు. పందులను తరలించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పెంపకందారులు ఆదివారం పందులను తీసుకుపోయారు.



పందిని బంధిస్తున్న పెంపకందారులు

జనానికి డబ్బులిచ్చి సభకు తీసుకెళ్లారు



తాండూరు రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభకు ప్రజలను బలవంతంగా తరలించారని డీసీసీబీ వైస్‌చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. సభకు వెళ్లేందుకు ప్రజలు ఆసక్తి చూపకపోవడంతో ఒక్కొక్కరికి రూ.500 చెల్లించి మరీ తరలించారని విమర్శించారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లేందుకు ప్రజలు ఆసక్తి చూపలేదని, కొందరు ఆ పార్టీ నాయకులు, కార్యర్తలే వెళ్లారని తెలిపారు. పోయిన వారికీ కూడా డబ్బులిచ్చే తీసుకెళ్లారన్నారు. తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్, తాండూరు, యాలాల నుంచి స్వచ్ఛందంగా ఎవరూ వెళ్లలేదన్నారు. ప్రజలకు పార్టీపై అభిమానం ఉంటే బీఆర్ఎస్ నాయకులు ఇంతగా ప్రచారం చేయాల్సిన అవసరం లేదన్నారు. సభ కోసం పెట్టిన బస్సులు ఖాళీగా కన్పించడంతో నాయకులు ప్రజల ఇళ్లకు వెళ్లి వారిని ఒప్పించి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజల మద్దతు పూర్తిగా కాంగ్రెస్‌కే ఉందని పేర్కొన్నారు.

మినీ స్టేడియం నిర్మాణం ఎప్పుడో?

- ఆమనగల్లులో ప్రతిపాదనలకే స్టేడియం పరిమితం
- వసతుల్లేక విద్యార్థులు, క్రీడాకారుల ఇబ్బందులు
- పంట పొలాలు, ఇళ్ల మధ్య ఆడుకుంటున్న వైనం



ఇరుకైన స్థలంలో ఆటలాడుతున్న విద్యార్థినులు(ఫైల్)

ఆమనగల్లు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో మినీ స్టేడియం నిర్మాణం కలగానే మిగిలింది. చాలా కాలంగా స్టేడియం నిర్మాణం విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపడం లేదు. స్టేడియం ఏర్పాటుకు స్థానికులు పదేళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతునా స్పందన లేదు. ప్రతి మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామన్న ప్రజాప్రతినిదుల హామీ ఏళ్లయినా అమలు కావడం లేదు. దీంతో క్రీడాకారులకు శిక్షణ కరువవుతోంది. పట్టణంలో స్టేడియం నిర్మాణం గురించి పలుమార్లు రాష్ట్ర మంత్రులు, అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు వినతిపత్రాలందజేశారు. ఐదు మండలాల కూడలిగా ఉండి హైదరాబాద్‌కు చేరువలో ఉన్న ఆమనగల్లులో స్టేడియం లేకక్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలలు, పాఠశాలలో చదువుకునేందుకు ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ మండలాల నుంచి వేల మంది విద్యార్థులు ఆమనగల్లుకు వస్తుంటారు. పట్టణంలో విద్యా సంస్థలు విస్తరిస్తున్నాయి. వివిధ గ్రామాల విద్యార్థులు చదువు కోసం స్థానికంగా ఉంటున్నారు. స్టేడియం లేక, పాఠశాలల్లో క్రీడామైదానాల్లేక క్రీడల్లో క్రీడాకారులు, విద్యార్థులు, యువకులు శిక్షణ పొందలేకపోతున్నారు. వేసవి సెలవుల్లో ఉదయం, సాయంత్రం విద్యార్థులు, క్రీడాకారులు ఆటలు ఆడుదామన్నా విధిలేక సమీప పొలాలు, ఇళ్ల మధ్య, ఖాళీ ప్లాట్లలో ఆడుతున్నారు. క్రీడాపోటీల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, క్రీడాభిమానులు ముందుకొస్తున్నా మైదానాల్లేక ఇబ్బందికరంగా మారింది. ఆమనగల్లులో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రజాప్రతినిధులు స్టేడియం ఏర్పాటుకు హామీలిచ్చినా అమలు కాలేదు. పట్టణంలోని అనేకచోట్ల స్టేడియానికి అనువైన ప్రభుత్వ స్థలాలు ఉన్నా వాటిని కేటాయించేందుకు నాయకులు, అధికారులు ప్రయత్నాలు చేయడం లేదు. ఆమనగల్లులో మినీ స్టేడియం ఏర్పాటుతో ఐదు మండలాల క్రీడాకారులు, విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. నేతలు, అధికారులు స్టేడియం నిర్మాణానికి చొరవతీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్టేడియం ఏర్పాటు చేయాలి



ఆమనగల్లులో మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేయాలి. ఐదు మండలాలకు కూడలి గా ఉన్న ఇక్కడ స్టేడియం లేక క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా క్రీడాకారులు శిక్షణ లేక జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించలేకపోతున్నారు. స్టేడియం కడితే క్రీడా పోటీల నిర్వాహణకు, శిక్షణకు పనికొస్తుంది. స్టేడియం నిర్మాణ విషయంలో ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించాలి.

- వీరబొమ్మ రామ్మోహన్, ఆమనగల్లు

గ్రౌండ్‌కు స్థలం కేటాయించాలి



మినీ స్టేడియం నిర్మాణానికి పట్టణంలో స్థలాన్ని కేటాయించాలి. నిర్మాణానికి ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేయాలి. స్టేడియం నిర్మిస్తే క్రీడల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు, క్రీడాకారులు శిక్షణ పొందే అవకాశం ఉంటుంది. పట్టణంగా అభివృద్ధి చెందుతున్న ఆమనగల్లులో స్టేడియం లేకపోవడం పెద్దలోటు.

- పవన్‌కల్యాణ్, ఆమనగల్లు

రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం

- విస్తరణ పనుల్లో మొరం బదులు డస్ట్
- వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు


రావుల్‌పల్లి-దౌల్తాబాద్ రోడ్డు దుస్థితి

దౌల్తాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల్లో నిర్లక్ష్యంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొడంగల్ మండలంలోని రావుల్‌పల్లి నుంచి దౌల్తాబాద్ వరకు నిర్మిస్తున్న రోడ్డు విస్తరణ పనుల్లో మొరంను వేయకుండా దుమ్ముతో కూడిన మట్టిని వేయడంతో నిత్యం వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము పైకి లేచి కళ్లలో పడటంతో తరచూ ప్రమాదాలకు గురి కావాల్సిన దుస్థితి ఏర్పడిందని పలువురు వాపోయారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించాలని కోరుతున్నారు. అదేవిధంగా పనులను త్వరగా పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోత



దుద్యాల మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గాల్లో కొంత మంది రైతులు వరిధాన్యం ఆరబోస్తున్నారు. దీంతో ద్విచక్ర, ఆటో వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు సగభాగానికి వరిగింజలు ఆరబోయడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనదారులైతే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

- దుద్యాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి)


పరిగి: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


తాండూరు రూరల్: బీఆర్ఎస్ బహిరంగ సభకు కోటబాస్పల్లి నుంచి తరలివెళ్తున్న నాయకులు


వికారాబాద్: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

శామీర్‌పేట: వరంగల్ సభకు బయల్దేరుతున్న నాయకులను, కార్యకర్తలతో ఎమ్మెల్యే మల్లారెడ్డి



రజతోత్సవ సభకు బీఆర్ఎస్ దండు

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వికారాబాద్-మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల నుంచి పార్టీ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో పెద్దఎత్తున తరలివెళ్లారు. అంతకుముందు పార్టీ జెండాను ఆవిష్కరించి సంబురాలు నిర్వహించారు


ఘట్‌కేసర్ రూరల్: అవుశాపూర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న మండల ప్రధానకార్యదర్శి కొండల్‌రెడ్డి


మూడుచింతలపల్లి: బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించిన మాజీ సర్పంచ్ రవి, నాయకులు


ఘట్‌కేసర్: పోచారం చౌరస్తాలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు


కొడంగల్: బీఆర్ఎస్ సభకు తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు


చౌడాపూర్: వరంగల్ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


పూడూరు: బస్సులో వెళుతున్న నాయకులు


బొంరాస్‌పేట్: రేగడిమైలారంలో జెండా ఆవిష్కరణ


దుద్యాల: పోలెపల్లిలో జెండా ఆవిష్కరణలో నాయకులు


దోమ: వరంగల్ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు


తాండూరు: జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పట్లోళ్ల నర్సింహులు

కోట్‌పల్లి: కరీంపూర్ గ్రామంలో జెండా ఎగురవేస్తున్న సుందరి అనీల్




మేడ్చల్ టౌన్: డబీల్‌పూర్‌లో జెండా ఎగురవేస్తున్న నాయకులు

కరన్‌కోట్ పంచాయతీ కార్యదర్శి బదిలీ

తాండూరు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరన్‌కోట్ పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రావు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆనంద్‌రావు 2013 నుంచి మండలంలోని చింతామణిపట్నం, పర్వతాపూర్, చెంగోల్, గౌతాపూర్, చంద్రవంచ, చిట్టిఘనాపూర్, ఓగీపూర్, కరన్‌కోట్ పంచాయతీల్లో గ్రేడ్-1 కార్యదర్శిగా విధులు నిర్వహించారు. అయితే ఆనంద్‌రావు ఆయన సర్వీస్‌లో చెంగోల్, కరన్‌కోట్ పంచాయతీల్లో రెండుసార్లు విధులు నిర్వహించారు. ప్రస్తుతం మేజర్ పంచాయతీ అయిన కరన్‌కోట్‌లో పనిచేస్తూ యాలాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రభుత్వం ఇంకా ఎవరినీ నియమించలేదు.

రాజ్యాంగం అత్యంత పవిత్రమైనది


కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

కోట్‌పల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం అత్యంత పవిత్రమైనదని కోట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్ అన్నారు. మండలంలోని బార్వాద్, బార్వాద్‌తాండ, మద్గుల్‌తాండ, కొత్తపల్లి, గ్రామాల్లో ఆదివారం భారత సంవిదాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఆయూబ్ అన్సారి, వాహీద్‌మియా పాల్గొన్నారు.

అన్ని డిపోల్లో జేఏసీ కమిటీలు వేయాలి

పరిగి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో జేఏసీ కమిటీలు వేయాలని ఆర్టీసీ జేఏసీకో-చైర్మన్ కె.హన్మంత్‌ముదిరాజ్ ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగులను ప్రభుత్వంలో విలీన డేట్‌ఆఫ్ అపాయింట్‌మెంట్, రెండు 2021, 2025 వేతన సవరణలు, 2017 వేతన సవరణ బకాయిలు, కారుణ్య నియమాకాల్లోని ఉద్యోగులకు రెగ్యులర్ ప్రాతిపదికన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

కీసర/వికారాబాద్/శామీర్‌పేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కీసర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1995-96 విద్యా సంవత్సరానికి 10వ తరగతికి చెందిన విద్యార్థులు, వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మేరి ఏ నాట్స్ స్కూల్‌లో 2002లో ఏడవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు, శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని బ్రింద కన్వెన్షన్ హాల్‌లో అలియాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాల్లో 1984-85 బ్యాచ్‌కు చెందిన టెన్త్‌విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి ఉపాధ్యాయులను సత్కరించారు.

హామీలు అమలు చేస్తున్న కాంగ్రెస్

శామీర్‌పేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని పీసీసీ కోఆర్డినేటర్లు పారిజాతరెడ్డి, భాస్కర్ అన్నారు. తూంకుంటలోని మొగుళ్ళ వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ మేడ్చల్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు హరివర్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, మైఎస్‌గౌడ్, నర్సింలుయాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి.. గగనమేనా?

(5వ పేజీ తరువాయి)

పనిరోజుల లక్ష్యంలో 101.09 శాతం పూర్తి చేసుకుని ఉపాధి పొందారు. కాగా, గత ఏడాదిలో కూలీలు పూర్తి చేసుకున్న పని రోజులతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో సగానికి సగం పని రోజులను తగ్గించారు. అయితే ఈ ఏడాది పని రోజుల్లో భారీగా కోత విధించడంతో ఉపాధి హామీ కూలీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి కల్పించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే.

పని రోజులు పెరిగేనా...?

ఉపాధి హామీ పథకంలో గత ఏడాది లభించినట్లుగా ఈసారి తమకు పని రోజులు లభిస్తాయా, లేదా? అని కూలీలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో కొనసాగే ఉపాధి పనులతో పాటు పనులకు హాజరయ్యే కూలీల హాజరు ఆధారంగా ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం పని రోజులను కేటాయిస్తుంది. గతేడాది లక్ష్యానికి మించి ఉపాధి పనులు చేపట్టిన వికారాబాద్ జిల్లాలో పనులు ఏ విధంగా కొనసాగాయని ప్రత్యేక బృందాలు పరిశీలించాయి. క్షేత్ర స్థాయిలో పనులు కొనసాగిన తీరు, పని ప్రదేశాల్లో కూలీల హాజరు ఏ విధంగా ఉందనేది ఈ బృందాలు పరిశీలించాయి. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పనులు కొనసాగాయా? లేదా అనేది కూడా ఆరా తీశాయి. గత ఏడాది జిల్లాకు కేటాయించిన పని రోజుల లక్ష్యాన్ని కూలీలు అధిగమించడమే కాకుండా వివిధ అంశాల్లో వికారాబాద్ జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. పని రోజులను జిల్లా కూలీలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోగా, ఈసారి గత ఏడాది కంటే ఎక్కువ పని రోజులు కేటాయించవచ్చని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆశించారు. కాగా, గత ఏడాది కంటే పని రోజుల్లో భారీగా కోత విధించడం చర్చనీయాంశంగా మారింది. ఈసారి గత ఏడాది మాదిరిగా పూర్తి స్థాయిలో తమకు ఉపాధి లభిస్తుందా లేదా అన్న ఆందోళన కూలీల్లో వ్యక్తమవుతోంది.

ఇప్పటికే 14 లక్షల పని రోజులు పూర్తి...

ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 33.61 లక్షల పని రోజులు కేటాయించగా, ఏప్రిల్ 26వ తేదీ వరకే జిల్లాలో పని రోజుల లక్ష్యంలో 41.65 శాతం పూర్తి చేశారు. జిల్లాలో 71,450 కుటుంబాలకు చెందిన కూలీలు 14 లక్షల పనిరోజులు పూర్తి చేసుకున్నారు. ఈసారి ఉపాధి పనుల కోసం జిల్లాకు రూ.150.07 కోట్ల బడ్జెట్ కేటాయించగా, దీంట్లో రూ.60 కోట్లు మెటీరియల్ కాంపొండ్ ఉంది. జిల్లాకు 33.61 లక్షల పని రోజులు కేటాయించగా, మే నెలలో పూర్తి స్థాయిలో శరవేగంగా ఉపాధి పనులు కొనసాగనుండగా, జూన్‌లో వ్యవసాయ పనులు ప్రారంభం కానున్నాయి. వ్యవసాయ పనులు ప్రారంభమైతే ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య చాలా వరకు తగ్గనుంది. జిల్లాకు కేటాయించిన ఉపాధి పని రోజుల లక్ష్యాన్ని అక్టోబర్ నాటికే పూర్తి చేసే అవకాశం ఉంది. పని రోజులు పూర్తయితే కూలీలకు ఉపాధి కల్పించేందుకు అదనంగా పనిరోజులు కల్పిస్తారా? లేక కూలీలకు విరామం ఇస్తారా అనేది స్పష్టత లేదు. గతంలో లక్ష్యానికి మించి కూలీలు పనులకు హాజరైతే కొంత సర్దుబాటు చేసి అందరికీ పనులు కల్పించేవారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమల్లోకి తీసుకురావడంతో ఉపాధి హామీ పనులకు డిమాండ్ పెరిగింది. ఉపాధి పనులకు హాజరయ్యేందుకు కూలీలు ఆసక్తి కనబరుస్తున్నారు. గతంలో జాబ్ కార్డు ఉన్నా పనులకు హాజరు కాని కూలీలు సైతం పనులు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

ఆరోగ్యానికి మిద్దెతోట


(5వ పేజీ తరువాయి)

బెండ, వివిధ రకాల వంకాయలు, బీర, సొర, కాకార, పొట్ల, దొండ, చిక్కుడు, పండ్లలో జామ, మామిడి, దానిమ్మ, నిమ్మ, సపోట, అరటి, వాటర్ ఆపిల్, బొప్పాయి మొక్కలు పెంచుతున్నాడు, వీటితో పాటు ఔషధ మొక్కలైన నల్లేరు, బిర్యాని ఆకు, ఓమ, లెమన్‌గ్రాస్, సబ్జా, మల్టీవిటమిన్స్ మొక్కలతోపాటు వివిధ రకాల పసుపు, చామగడ్డ, మునగ వంటి మొక్కలను పెంచుతున్నాడు. పలురకాల కూరగాయాలు, ఆకుకూరలు, పండ్లు లభించడంతోపాటు పచ్చటి వాతావరణంతో ఇల్లంతా చల్లగా ఉంటుంది. వేసవిలో భవనం వేడెక్కకుండా ఉంటుందని చెబుతున్నాడు.

భవనానికి వచ్చే ముప్పేమీ లేదు

మొక్కల పెంపకానికి ఫైబర్ టబ్బులను వినియోగించడం వల్ల భవనంపై ఎలాంటి భారం పడదని పలువురు ఇంజినీర్లు చెబుతున్నారు. కుండీల్లో వాడే మట్టిలోనూ సగం వరకు కోకోపీట్, కొబ్బరి పీచు నుంచి వెలువడే పొడిని ఉపయోగించడం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. మిద్దె తోటల పెంపకంతో నిత్యం వ్యాయమంతోపాటు ఇంటికి అవసరమైన తాజా కూరగాయాలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్లు పొందవచ్చు. కోతుల బెడద ఉంటే సోలార్ ఫెన్సింగ్ వేసుకోవచ్చు. 200 గజాలకు సోలార్ ఫెన్సింగ్ వేసుకోవడానికి రూ.30 వేల వరకు ఖర్చు అవుతుంది. ఒకసారి సోలార్ ఫెన్సింగ్ వేస్తే పదేళ్ల వరకు పని చేస్తుంది. ప్రస్తుతం చాలా మంది నగరవాసుల పిల్లలకు బియ్యం ఎక్కడి నుంచి వస్తాయో తెలియని పరిస్థితి. అలాంటి దుస్థితి రాకుండా ముందు తరాలకు పూర్తి అవగాహన ఉండాలంటే మిద్దెతోటల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మిద్దెతోటల సాగుకు రాయితీలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మిద్దె తోటలతో ఆరోగ్యం



ప్రతి ఒక్కరూ మిద్దెతోటలను సాగుపై దృష్టిపెడితే అనేక రకాల ప్రాణాంతక వ్యాధులు దరిచేరకుండా కాపాడుకోవచ్చు. ఫైబర్ టబ్బులు దీర్ఘకాలం మన్నికగా ఉంటాయి. ప్రస్తుతం మా వద్ద ఎనిమిది రకాల టబ్బులు అందుబాటులో ఉన్నాయి.

- పిట్టల శ్రీశైలం, ఫైబర్ టబ్బుల సంస్థ యాజమాని

టబ్బులతో భారం పడదు



ఫైబర్ టబ్బులతో ఏర్పాటు చేస్తున్న మిద్దెతోటలతో భవనాలపై ఎలాంటి భారం పడదు. ఈ విషయమై చాలా మంది వివరాలు అడుగుతున్నారు. తేలికపాటి ఫైబర్ టబ్బుల్లో కొంతమట్టి, కోకోపీట్, పశువుల పేడ ఎరువులను వాడుతున్నారు. ఇది పెద్ద బరువుకాదు. భయపడాల్సిన అవసరం లేదు.

- శంకర్ శివరాం, ఇంజినీర్, ఘట్‌కేసర్

ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీ



మర్పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

పరిగి/మర్పల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ పరిగిలో బసిరెడ్డిపల్లి కృష్ణానందగురుస్వామి ఆధ్వర్యంలో క్రిష్ణగిరిక్షేత్రం నుంచి ఆదివారం గ్రామం భారీ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా మర్పల్లి మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన హిందువులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ సభకు జనాల కరువు'

పెద్దేముల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవసభకు జనాలు కరువయ్యారని, ఆపార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడం లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, ఏఎంసీ వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభకు తరలించేందుకు బీఆర్ఎస్ బస్సులు ఏర్పాటు చేసినా ప్రజల నుంచి పెద్దగా స్పందన రాలేదని అన్నారు. మండలంలో ఆపార్టీ ప్రభావం ఏమాత్రం కనిపించలేదని చెప్పారు. పార్టీకి స్పందనలేకపోవడంతో బీఆర్ఎస్ నేతల్లో కలవరం మొదలైందని ఎద్దేవా చేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కులకచర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కామునిపల్లికి చెందిన కృష్ణ(50) బైక్‌పై అంతారం నుంచి కులకచర్లకు వస్తున్నాడు. ఈక్రమంలో దోమ మండలంలోని మోత్కూర్ గ్రామానికి చెందిన వ్యక్తి లూనాపై వస్తున్న ఇద్దరు ఢీ కొన్నాడు. ఈ ఘటనలో కృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి బైక్‌పై మరో ఇద్దరు ఉన్నారు. స్వల్ప గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

కీసర రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడును అపహరించుకెళ్లిన ఘటన ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస వివరాలిలా ఉన్నాయి. దమ్మాయిగూడ మున్సిపాలిటీ, కీసర మండలంలోని యాద్గార్‌పల్లికి చెందిన చింత శ్రీనివాస్, అతడి భార్య పద్మ ఇద్దరూ కలిసి తమ కూతురు ఎంగేజ్‌మెంట్‌కు కావల్సిన వస్తువులు కొనుగోలు చేసేందుకు కీసరకు వచ్చారు. కొనుగోళ్లు ముగించుకుని తిరిగి తమ ఇంటికి బయల్దేరారు. కీసర శివారులోని గోశాల వద్దకు చేరుకోగా వెనుక నుంచి మరో బైక్‌పై వచ్చిన దుండగులు బైక్‌పై వెళ్తున్న పద్మ మెడలోంచి నాలుగు తులాల పుస్తెల తాడును అపహరించుకెళ్లారు. ఆమె తేరుకునేలోపే దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో వెంటనే కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇంట్లోని వస్తువులు

చౌడాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చాకల్‌పల్లిలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన హరిజన్ మల్కమ్మ ఇంట్లో ఆదివారం ఉదయం ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న సామగ్రి దగ్ధమయ్యాయి. దాదాపు 4లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

చైన్‌స్నాచర్ రిమాండ్

కొడంగల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చైన్‌స్నాచర్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 25న కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లో కొడంగల్ మండలంలోని టేకుల్‌కోడ్ గ్రామానికి చెందిన రాములమ్మ, దౌల్తాబాద్ మండలంలోని చంద్రకల్ గ్రామానికి చెందిన నారాయణమ్మ అనే ఇద్దరు మహిళలు బస్సు ఎక్కుతుండగా ఇరువురి మెడలోని బంగారు గొలుసులు అపహరణకు గురయ్యాయి. నిందితురాలు పరిగి మండలం తుంకుల్‌గడ్డకు కావలి అనంతమ్మగా గుర్తించిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం స్థానిక బస్టాండ్‌లో నిందితురాలిని పట్టుకున్నారు. ఆమెనుస్టేషన్‌కు తరలించి పలుసెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ తెలిపారు.

నమ్మించి డబ్బులు కాజేసిన ఇద్దరి అరెస్ట్

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్లాట్‌పత్రాలు విడిపించుకునేందుకు రూ.2లక్షలు అడిగి తిరిగి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ నర్సింహా తెలిపిన వివరాల ప్రకారం.. కీసర మండలం దమ్మాయిగూడలోని న్యూభవానినగర్‌కు చెందిన సివిల్ కాంట్రాక్టర్ కొమ్మరాజుల సాయిలుకు 2025 జనవరి 8న వరంగల్‌కు చెందిన బాలుసింగ్, రఫిక్‌నాయక్‌లు ఫోన్‌చేసి తమ ప్లాట్‌పత్రాలు కుదవపెట్టామని, రూ.2లక్షలు ఇస్తే ప్లాట్‌పత్రాలు విడిపించుకొని రూ.50వేలు ఎక్కువ ఇస్తామని నమ్మబలికారు. దీంతో సాయిలు మరుసటి రోజు 9న ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైపాస్‌రోడ్డు వద్ద వారు అడిగిన రూ.2లక్షలను బాలుసింగ్, రఫిక్‌నాయక్‌లకు ఇచ్చాడు. అయితే తిరిగి డబ్బులు ఇవ్వకుండా వరంగల్‌కు పారిపోయారు. కొద్దిరోజుల నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ పెట్టుకున్నారు. దీంతో మోసపోయానని గ్రహించిన సాయిలు శనివారం ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు వారిని ఆదివారం అదుపులోకి తీసుకొని సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షిప్తంగా..

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది

కీసర: అన్ని దానాల కన్నా, అన్నదానం ఎంతో గొప్పదని కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ అన్నారు. ఈ మేరకు ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని కీసరగుట్టలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో ఆదివారం జరిగిన అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి ఘట్‌కేసర్ సహకార సంఘం డైరెక్టర్ ఆర్.లక్ష్మారెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కొడంగల్/శామీర్‌పేట: పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శామీర్‌పేటలోని శ్రీభవానిరామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి మాసశివరాత్రి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

30న తాండూరులో పూలే, అంబేడ్కర్ జన జాతర

తాండూరు: ఈ నెల 30న తాండూరులో పూలే, అంబేడ్కర్ జన జాతర సభను నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ ఆదివారం నిర్వహించిన సమావేశంలో తెలిపారు.

అక్రమ వలసదారులను వెనక్కి పంపాలి

తాండూరు: పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో తాండూరులో ఉన్న రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు, పాకిస్తాన్ మూలాలు కలిగిన అక్రమ వలసదారులను గుర్తించి పంపించాలని బీజేపీ తాండూరు పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం ఆధ్వర్యంలో ఆదివారం డీఎస్పీ, సీఐ, ఎస్ఐలకు ఫిర్యాదు చేశారు.

గ్రామ మహిళా సంఘం నూతన కమిటీ

బొంరాస్‌పేట్: ఏర్పుమళ్ల గ్రామంలో ఆదివారం మహిళా సంఘం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కవిత, కార్యదర్శిగా లలిత, కోశాధికారిగా నర్సమ్మను ఎన్నుకున్నట్లు సీసీ రాంచంద్రయ్య తెలిపారు.

మోదీ నాయకత్వంలో అభివృద్ధి పథంలో భారత్

శామీర్‌పేట: ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అలియాబాద్ చౌరస్తాలోని ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ మేదావుల సదస్సు (సెమినార్)ను నిర్వహించారు.

నేడు మైన్స్ శాఖ అవగాహన సదస్సు

తాండూరు: తాండూరు మైన్స్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28 (నేడు) ఉదయం 10 గంటలకు స్టోన్ భవనం నందు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మైన్స్ ఏడీ సత్యనారాయణ తెలిపారు.